విద్యార్థికి అభినందనలు

విశాలాంధ్ర - కవిటి : కీర్తి శేషులు బాలి వెంకటరమణ స్కూల్ అసిస్టెంటు (పిఎస్) జ్ఞాపకార్థం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా రణస్థలం మండలంలో జే ఆర్ పురంలో 10వ తరగతి ఇంగ్లీష్ మీడియం విద్యా ర్థులకు నిర్వహించిన టాలెంటు టెస్టులో కవిటి మండలం ముత్యాలపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి ప్రియా.మురహరి 7వ స్థానం సాధించి రూ.4 వేలు నగదు పురస్కారం పొందిన సంద ర్భంగా హెచ్ఎం చిత్రి. ఈశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది, ఎస్ఎంసి చైర్మన్ విద్యార్థికి ఆదివారం పాఠశాల వద్ద జ్ఞాపిక అందజేసి భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ కమిటి చైర్మన్ రెయ్యి. లోకనాథం. ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, కృష్ణ, మొర్రి గోపి, అప్పలరాజు, సింహాచలం, నాగమణి, సంతోష్ కుమారి, యోహన్, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమానికి భాగస్వామ్యమే కీలకం : ప్రిన్సిపల్ సెక్రెటరీ సత్యనారాయణ

విశాలాంధ్ర - శ్రీకాకుళం : వెనుకబడిన తరగతుల సంక్షేమ కార్యక్రమాల పూర్తి విజయానికి వారి భాగస్వామ్యమే అత్యంత కీలకమని బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సత్యనారాయణ స్పష్టం చేశారు. ఆదివారం శ్రీకాకుళం కలెక్టర్ కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు, కుల సంఘాల ప్రతినిధులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గతంలో విజయవంతమైన 'ఆదరణ 1, 2' కార్యక్రమాలకు కొనసాగింపుగా 'ఆదరణ 3' కార్యక్రమాన్ని నిర్వ హించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు భావిస్తున్నారని, ఇందులో భాగంగా కుల సంఘాల ప్రతినిధులు, ప్రజల అభిప్రాయాలు, సూచనలు తీసుకొని గతంలో కంటే మెరుగైన విధానాన్ని రూపొందించాలని ఆదేశించారని తెలిపారు. దానికి అనుగుణంగానే జిల్లాల్లో పర్యటించి అభిప్రాయాలు సేకరిస్తున్నామని సత్యనారాయణ వివరించారు. ఈ పథకంలో భాగంగా ఇప్పటివరకు 550 వృత్తిపరమైన పరికరాలను గుర్తించడం జరిగిందని, వృత్తిపరంగా ఆధునిక పరికరాలను, నైపుణ్యాన్ని అందించేందుకు ప్రయత్నిస్తున్నామని ఆయన పేర్కొన్నారు. బీసీల జనాభాను అనుసరించి పథకాలు అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించినట్లు వెల్లడించారు. బీసీ ప్రొటెక్షన్ యాక్ట్ ముసాయిదా తయారీ వెనుకబడిన తరగతుల రక్షణ కోసం బీసీ ప్రొటెక్షన్ యాక్ట్ ముసాయిదా తయారవు తోందని సత్యనారాయణ వెల్లడించారు. బీసీలకు విద్యా, సామాజిక, ఆర్థిక రక్షణ కల్పించడమే ఈ ముసాయిదా ప్రధాన ఉద్దేశమని ఆయన పేర్కొన్నారు. సమావేశంలో పలు కుల సంఘాల ప్రతినిధులు తమ సమ స్యలు, అభిప్రాయాలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రజక కార్పొరేషన్ డైరెక్టర్ దుర్గారావు ఆధునిక ధోబీ ఘాట్‌ల నిర్మాణాన్ని కోరగా, యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ ఇప్పిలి జగదీశ్వర్‌రావు యాదవులకు బంజరు భూములు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కమ్మరి, కలుస్తులకు టార్పాలిన్లు సరఫరా చేయాలని, విశ్వబ్రాహ్మణులకు ఇంటి దగ్గర కలవకు కొంతవరకు అనుమతిస్తే అధికారుల వేధింపులు తగ్గుతాయని ఆ సంఘం ప్రతినిధులు కోరారు. పలు కుల సంఘాల ప్రతినిధులు బీసీలకు పింఛన్ వయస్సును 50 సంవత్సరాలకు తగ్గించాలని అభ్యర్థించారు. నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఆసుపత్రులు, దేవాలయాల్లో ప్రత్యేక పోస్టులు, బ్యూటీ పార్లర్, స్పా ఏర్పాటుకు రుణాలు ఇవ్వాలని కోరగా, పొందర కూరాకుల కులాల వారు మోపెడ్స్, బోర్ వెల్స్, రైతు బజార్లలో షాపులు ఏర్పాటు చేసేందుకు అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. అవసరాలకు తగిన పరికరాలు అందజేయాలని కళింగ కార్పొరేషన్ చైర్మన్ రోణంకి కృష్ణం నాయుడు మాట్లాడుతూ అన్నారు. స్థానిక అవసరాలకు పనికొచ్చే వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలను బీసీలకు అందజేయాలని కోరారు. కుల వృత్తుల యూనిట్లకు విద్యుత్ రాయితీ కల్పించాలి అని కోరారు. ఈ సమావేశంలో డీఆర్వో ఎస్.వి. లక్ష్మణమూర్తి, జిల్లా బీసీ సంక్షేమాధికారిణి అనురాధ, బీసీ కార్పొరేషన్ ఈడీ గడ్డెమ్మ, జిల్లా ప్రత్యేకాధికారి మారెళ్ళ వెంకటేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల సాగు భూములకు పట్టాలు ఇవ్వాలి

విశాలాంధ్ర - సోంపేట : దశాబ్దాలుగా గిరిజనుల సాగులో ఉన్న పోడు భూములకు ప్రభుత్వం వెంటనే సాగుదారుల పేరిట పట్టాలు మంజూరు చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యులు సాలిన నారాయణమూర్తి డిమాండ్ చేశారు. కంచిలి మండలం కుమ్మరి నౌగాం పంచాయతీ భువనపురం గ్రామంలో గిరిజన గ్రామాల సిపిఐ కార్యదర్శుల సమావేశం ఆదివారం నారాయణస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడవి తల్లిని నమ్ముకొని అనాదిగా జీవనం సాగిస్తున్న గిరిజనుల హక్కులను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని గుర్తు చేశారు. గిరిజనుల జీవనోపాధి పెంచేందుకు వారికి తగు ఆర్థిక భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు. పట్టాలి ఇచ్చేంతవరకు గిరిజనులతో కలిసి పోరాటం చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యురాలు పుక్కళ్ళ అరేలమ్మ, పొందర దామోదర్, లోకనాథం, సోమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ సీఐగా రామకృష్ణ

విశాలాంధ్ర - పలాస : కాశీబుగ్గ సిఐగా వై.రామకృష్ణ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన వి.సూర్య నారాయణ బదిలీ కావడంతో ఆయన స్థానంలో సీఐగా రామకృష్ణ బదిలీ పై వచ్చారు. రామకృష్ణ గతంలో 2013లో ఇక్కడ పని చేయడం వల్ల ఈ ప్రాంతంపై ఆయనకు పూర్తిస్థాయి పట్టు ఉంది. దీనితో ఈ ప్రాంతంలో శాంతిభద్రతలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

శివసాగర్ బీచ్‌కు పర్యాటకుల తాకిడి

విశాలాంధ్ర - వజ్రపుకొత్తూరు : మండలం బైపల్లి సమీపంలో గల శివసాగర్ బీచ్‌కు ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. శివసాగర్ బీచ్‌కు పర్యాటకుల తాడికి ఎక్కువుగా ఉండడంతో ట్రాఫిక్ అంతరాయ కలగకుండా, సముద్ర స్నానంనకు వెళ్లిన వారికి ముందస్తు జాగ్రత్తలు ఉండాలని భావనపాడు మెరైన పోలీసులు, వజ్రపుకొత్తూరు పోలీసులు పలు సూచనలు చేశారు. బీచ్‌లో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.

పరామర్శలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర - లావేరు : లావేరు మండలం తాళ్ళవలస గ్రామంలో సర్పంచ్ ప్రతినిధి దేశెట్టి తిరుపతిరావు ఆరోగ్యం బాగులేదని విషయం తెలుసుకొని వారిని పరామర్శించి వారి యోగ క్షేమాలు ఎచ్చెర్ల నియోజకవర్గ మాజీ శాసన సభ్యులు గొర్లె కిరణ్ కుమార్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు మీసాల రాంబాబు, సంచానా సత్యనారాయణ, మీసాల శ్రీనివాస్, వనువురెడ్డి అప్పారావు, దేశెట్టి ఆనంద్, కంది శ్రీనివాస్, మొంగం నూకరాజు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కళారాధకుడు గణేశ్వర స్వామికి ఘన సన్మానం

విశాలాంధ్ర - పలాస : చత్తీస్ ఘడ్ భిలాయి స్టీల్ ప్లాంట్ లో ఉద్యోగం చేస్తూ ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రవాసాంధ్ర ప్రజా నాట్య మండలి కళా సైనికుడు గణేశ్వర స్వామిని ఆదివారం నెహ్రూ హౌస్, సెక్టర్-1 లో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ప్రవాసాంధ్ర ప్రజా నాట్య మండలి అధ్యక్షుడు రుద్రమూర్తి దుశ్శాలువ కప్పి పుష్పాలు వేసి సన్మాన పత్రం బహూకరించారు . ఈ సందర్భంగా రుద్రమూర్తి మాట్లాడుతూ - గణేశ్వర స్వామి క్రియాశీలక కళా సైనికుడు,తాను నాటకాల్లో వేషం వేయక పోయినా, స్థానిక మరియు పరిషత్తు నాటకాల్లో అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించిన కళా సేవకుడు,కళారాధకుడని ప్రశంసించారు.ప్రవాసాంధ్ర ప్రజా నాట్య మండలి ప్రముఖుడు మొరిపల్లి బాబూరావు ప్రసంగిస్తూ - గణేశ్వర స్వామి వామపక్ష భావజాలంతో సామాజికంగా, సాంస్కృతిక పరంగా తన జీవితాన్ని కొనసాగించారని భవిష్యత్తులో కూడా ఇదే ప్రయాణం కొనసాగించాలని ఆకాంక్షించారు. ఈ సభలో ప్రధాన కార్యదర్శి సి హెచ్ శ్రీనివాస్, నాటక పరిషత్తు పూర్వ ప్రధాన కార్యదర్శి సాగూరు నారాయణ స్వామి, పరిషత్తు నాటక సమితి కోశాధికారి మొరిపల్లి ధర్మారావు ప్రభృతులు గణేశ్వర స్వామికి పుష్పమాలలతో సన్మానం చేస్తూ ఆయన విశ్రాంత జీవితం ఆరోగ్యమయంగా,ఆనంద భరితంగా ఉండాలని అపేక్షించారు.

ఘనంగా ఎమ్మెల్యే రమణమూర్తి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఆదివారం ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గ టిడిపి కార్యకర్తలు, నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముందుగా దివంగత రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, ఎన్టీఆర్, దివంగత శ్రీకాకుళం జిల్లా మాజీ కేంద్ర మంత్రి, కింజరాపు ఎర్రంనాయుడు విగ్రహాలకు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కళింగ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, రోణంకి కృష్ణంనాయుడు, పొందర, కూరాకుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్, దామోదర నర్సింహులు, వెలమ కార్పొరేషన్ రాష్ట్ర మాజీ చైర్మన్, ప్రతినిధి, కరగాం పంచాయితీ సర్పంచ్, పంగ బావాజీనాయుడు తదితరులు కేక్ కట్ చేసి, టీడీపీ అభిమానులకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో జీవితాంతం సంతోషంగా ఉండాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి రాజీ లేకుండా కృషి చేశారని, ప్రజల మనిషైన బగ్గు రమణ మూర్తి సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా అభివృద్ధి చేశారని తెలిపారు. టిడిపి శ్రేణులు ఆధ్యక్షతన నిర్వహించే ఈ జన్మదిన వేడుకలు అభి మానుల ఆనందోత్సాహాల మధ్య జరిగాయి. అనంతరం సామాజిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పళ్ళు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాలుగు మండలాలకు చెందిన వ్యవసాయ మార్కెట్ కమిటీల చైర్మన్లు, పిఏసియస్ అధ్యక్షులు, డైరక్టర్లు, వంశధార డిస్ట్రిబ్యూటరీ కమిటీ చైర్మన్లు, పంచాయితీ సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు మెంబర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని వైద్య సేవలు విస్తృతం చేయాలి

జెమ్స్ కళాశాల అనస్థీషియా విభాగాధిపతి డా.డివిజి శంకరరావు

విశాలాంధ్ర - శ్రీకాకుళం రూరల్ : ప్రస్తుతం విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకొని వైద్య రంగంలో సేవలు విస్తృతం చేయాలని జెమ్స్ కళాశాల అనస్థీషియా విభాగాధిపతి డా.డివిజి శంకరరావు సూచించారు. జెమ్స్ వైద్య కళాశాల, అనస్థీషియా విభాగం ఆధ్వర్యంలో జోనల్ సీఎంఈ (నిరంతర వైద్య విద్యా సదస్సు) ఆదివారం నిర్వహించారు. ఉత్తరాంధ్ర జోన్ లో ఉన్న ఎనిమిది ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల నుండి 200 మంది అనస్థీషియా పీజీ విద్యార్థులు, వైద్యులు పాల్గొన్నారు. తమ రంగంలో కృత్రిమ మేధ పాత్ర, ఆధునిక పరిణామాలు, రోగి సంరక్షణ లో మేలైన విధానాలు తదితర అంశాలపై బోధన, చర్చలు జరిగాయి. జెమ్స్ వైద్య కళాశాల, అనస్థీషియా విభాగాధిపతి డా.డివిజి శంకరరావు ఆర్గనైజింగ్ చైర్మన్ బాధ్యత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్య రంగంలో జెట్ స్పీడు తో అందివస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని రోగులకు సేవ చేయాలని విద్యార్థుల్ని కోరారు. వైద్యులు నిరంతరం విస్తరిస్తున్న సాంకేతిక పరిజ్ఞానంపై కూడా దృష్టి సారించి వైద్యరంగంలో మరింత ఉన్నతి సాధించాలని కోరారు. ఎన్టీఆర్ విశ్వ విద్యాలయం తరపున పర్యవేక్షకునిగా వ్యవహరించిన డా. మురళీ కృష్ణ మాట్లా డుతూ కార్యక్రమం విజ్ఞాన దాయకంగా, విజయవంతంగా నిర్వహించబడుతున్నందుకు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జెమ్స్ కళాశాల వివిధ విభాగాల డైరెక్టర్లు డా. సుధీర్,డా. శ్రీధర్ రెడ్డి, డా.రామారావు, ప్రభుత్వ వైద్య కళాశాల, శ్రీకాకుళం అనస్థీషియా హెడ్ డా.సుబ్బలక్ష్మి,జెమ్స్ అనస్థీషియా వైద్యులు డా.ప్రదీప్, డా.అశోక్, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

మండలం కేంద్రంలో ట్రాఫిక్ సమస్యలు

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : మండల కేంద్రం సంతబొమ్మాళిలో నిత్యం ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నాయి. స్థానిక బస్టాండ్ నుంచి గ్రామంలోకి వెళ్లాలంటే వాహనదారులు ఫీట్స్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. రోడ్డు మీదే కూరగాయలు షాపులు, తోపుడు బళ్ళు, ఆటోలు ఉండడం వల్ల ఒక బండి వెళితే ఎదురుగా రెండో బండి రావడానికి కూడా వీలు లేని దుస్థితి ఏర్పడు తుంది. బస్టాండ్లో ఇరువైపులా రోడ్డుపైన కూరగాయలు దుకాణాలు పెట్టడంతో కొనుగోలుదారులు గుంపులుగా రోడ్డు పై ఉండడంతో దారి లేకుండా ఏర్పడింది. తాజాగా ఆదివారం సాయంత్రం 6గంటల సమయంలో రోడ్డు పై ట్రాక్టర్, ఆటోలు, ద్విచక్ర వాహనాలు నిలిచి పోయి ట్రాఫిక్ ఇబ్బందిగా మారింది. రోజూ బస్టాండ్‌లో ఈ ట్రాఫిక్ ఇబ్బందులు కలుగుతున్నా పోలీసులు పట్టించుకొనే పాపాన పోలేదనే విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. బస్టాండ్, రామమందిరం వద్ద కొన్ని సమయాల్లో పాదచారులు కూడా ఇబ్బందిగా ఈ ట్రాఫిక్ సమస్య ఉంటుంది. అలాగే బజారు వీధి, రామ్ మందిరం పరిసరాలలో నిత్యము రహదారి పైన కూరగాయలు దుకాణలు, చేపలు గంపలు పెట్టి వ్యాపారాలు చేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తప్పడం లేదు. మండల కేంద్రం లో పోలీస్ స్టేషన్ ఉన్నప్పటికీ ఈ ట్రాఫిక్ సమస్యలు ఏ రోజు సరిచేసిన దాఖలాలు కనబడడం లేదు. ఇప్పటికైనా పోలీసులు గ్రామ పెద్దలు జోక్యం చేసుకొని బస్టాండ్ నుంచి రామ మందిరం మధ్య ఉన్న ఈ సమస్య ట్రాఫిక్ సమస్యలు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భావనపాడులో కోటి సంతకాలు సేకరణ

విశాలాంధ్ర - సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మండలం భావనపాడు పంచాయతీ లో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీ లు ప్రైవేటు పరం చేయటానికి నిరసనగా సంతకాలు సేకరించి గవర్నర్ కి సమర్పించటం జరుగుతుందని టెక్కలి నియోజకవర్గం వైసీపీ ఇంచార్జి పేడాడ తిలక్ అన్నారు. స్థానిక సర్పంచ్ బుడ్డ మోహన్ రెడ్డి, ఎంపిటిసి బుడ్డ రాజేశ్వరి, వైసీపీ నాయుకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మందస మండలంలో పౌర సరఫరాల శాఖ వైఫల్యం

రేషన్ బియ్యం పంపిణీలో తరుగు.. ఆందోళనలో వినియోగదారులు

విశాలాంధ్ర - మందస : రేషన్ కార్డుల వినియోగదారులకు సేవలు అందించడంలో మందస మండలంలో పౌరసరఫరాల శాఖ పూర్తిగా వైఫల్యం చెందుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ డిపోలకు చెందిన కొంతమంది డీలర్లు వినియోగదారులకు సరుకులు పంపిణీ సక్రంగా చేయడంలో సేవలు అందించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని వినియోగ దారులు విమర్శిస్తున్నారు. ఈనెల రేషన్ డిపోల ద్వారా పంపిణీ జరగాల్సిన పంచదార వినియోగదారులకు సక్రమంగా సరఫరా కాలేదు. కొన్ని రేషన్ డిపోల ద్వారా మాత్రమే పంచదార వినియోగదారులకు అందించారు. పంచదార పంపిణీలో వినియోగదారులకు అందడంలో తారతమ్యం ఉండటం పట్ల వారు ప్రశ్నిస్తున్నారు. అరకేజీ పంచదార 17 రూపాయలకు వినియోగదారులకు ఇవ్వాల్సి ఉండగా కొంతమంది డీలర్లు వినియోగదారుల నుంచి 20 రూపాయలు చొప్పున వసూళ్లు చేస్తున్నారు. 20 రూపాయలు వసూలు చేసిన డీలర్లు వినియోగదారులకు ఒక్కొక్క అగ్గిపెట్టి లేకపోతే ఒక చాక్లెట్ ఇస్తున్నారు. అంతేకాకుండా పౌరసరఫరాల శాఖ డీలర్లకు ప్రతినెల సరఫరా చేస్తున్న బియ్యంలో ఒక క్వింటాకు 10 నుంచి 20 కేజీల వరకు తక్కువ ఉంటున్నాయని కొంతమంది డీలర్లు ఆరోపిస్తున్నారు. దీనివల్ల ఒక్కొక్క వినియోగదారునికి తమ రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేస్తున్న బియ్యంలో తమ సొంత గోనె సంచె లో తూకం వేసి ఎనిమిది వందల గ్రాములు తక్కువగా ఇవ్వాల్సి వస్తుందని తమకు జరుగుతున్న నష్టాన్ని కవర్ చేసుకుంటున్నామని అనేకమంది డీలర్లు బహిరంగంగా అంటున్నారు. వికలాంగులు వృద్ధులు మంచం పట్టిన వ్యాధిగ్రస్తులు రేషన్ డిపోల ద్వారా రేషన్ సరుకులను కూలీల ద్వారా ఇళ్లకు తీసుకు వెళుతున్నారు. దీనివల్ల తమపై అదనపు ఆర్థిక భారం పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపోతే గత నెలలో ఈ మండలంలో సుమారు 25 అంగన్వాడీ కేంద్రాలకు బియ్యము కందిపప్పు నూనె సరఫరా జరగలేదు. ఈ విషయంలో ఈ శాఖ అధికారుల నిర్లక్ష్య వైఖరి స్పష్టంగా కనిపిస్తోందని అంగనవాడి కేంద్రాల నిర్వాహకులు అంటున్నారు. ఈ విషయంపై అంగన్వాడి కేంద్రాల కార్యకర్తలు పలాస సివిల్ సప్లై గొడవకు వెళ్లి ఫిర్యాదు చేసిన సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో కూడా ప్రతి నెలలో తమ కేంద్రాలకు సరుకులు పంపిణీలో కోత విధిస్తున్నారని ఇదేమిట నీ ప్రశ్నిస్తే సమాధానం ఉండటం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే జిల్లా ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని రేషన్ కార్డుల వినియోగదారులు అంగన్వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.

ప్రభుత్వం అండగా ఉంటుంది ...అధైర్యం పడవద్దు

ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ కూన రవికుమార్

విశాలాంధ్ర - ఆమదాలవలస : గొర్రెల కాపరులకు ప్రభుత్వపరంగా అండగా ఉంటా మని అధైర్య పడవద్దని ఎమ్మెల్యే పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆదివారం పొందూరు మండలం కొంచాడ గ్రామంలో గొర్రెల కాపరి కురమాన రమణ కుటుంబం సభ్యులను ఎమ్మెల్యే పరా మర్శించారు. ఇటీవల కుక్క కాటుకు గొర్రెల మృతి చెందిన విషయం విధితమే. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం తరపున అలాగే వ్యక్తిగతంగా సహకరించేందుకు అన్ని విధాల కృషి చేస్తానని అన్నారు. స్థానిక నాయకులతో కలిసి రమణ కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు.

కొండపేట రైతును పరామర్శించిన ఎమ్మెల్యే

బూర్జ మండలం పెద్ద పేట పంచాయతీ పరిధి కొండ పేటలో శనివారం రాత్రి వరి ధాన్యం కూప్పలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే రవికుమార్ రైతులు మజ్జి సూర్యనా రాయణ, పాలక వరహాలమ్మ లను పరామర్శించే ఓదార్చారు. పంట నష్టాన్ని పరిశీలించి అవసరమైన సహాయాన్ని అందించాలని అధికారులకు ఆదేశించారు. కుటుంబాలకు జరిగిన నష్టానికి అండగా నిలిచి వారి జీవనం పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటా మన్నారు. వరి కుప్పలు దగ్ధంపై బూర్జ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆయనతో పాటు మార్కెట్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ అధికారులు నాయకులు ఉన్నారు.

సీఎం చంద్రబాబును కలసిన రజక నాయకులు

విశాలాంధ్ర - రణస్థలం : అమరావతి విజయవాడ మంగళగిరిలో ఉన్న టీడీపీ పార్టీ ఆఫీసు కేంద్ర కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని కలిసి రజకుల సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రం ఇవ్వడం జరిగింది. రజకులను ఎస్సీల్లో చేర్చాడానికి కమిషన్ ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యాప్తంగా ఎండోమెంట్ దేవాలయ పాలకమండలిలో రజకులకు కూడా అవకాశం కల్పించే విధంగా రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేయాలని తెలుగుదేశం పార్టీలో పనిచేస్తున్న రజకులకు ఉత్తరాంధ్ర కోస్తా రాయలసీమ నుండి పదిమంది రజకులకు టీడీపీ రాష్ట్ర కమిటీలు అవకాశం కల్పించాలని ముఖ్యమంత్రికి తెలియజేయడం జరిగింది. ముఖ్యమంత్రి ఈ మూడు విషయాల పట్ల సానుకూలంగా స్పందించడం జరిగింది. త్వరలో ఒక్కొక్కటి పరిష్కరిస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ముఖ్యమంత్రికి రాష్ట్ర వ్యాప్తంగా రజకులందరి తరపున కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఏపీ రజక కార్పొరేషన్ మాజీ చైర్మన్ రాజమండ్రి నారాయణ, ఏపీ రాష్ట్ర రజక జనసేవ సంఘం రాష్ట్ర అధ్యక్షులు అక్కినపల్లి లక్ష్మయ్య, టీడీపీ బీసీ నాయకులు మారయపూర్వకంగా కలసి రజకుల సమస్యలు వివరించామని వారు తెలిపారు.

కళింగవైశ్య వనభోజన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ఎంజీఆర్

విశాలాంధ్ర - హిరమండలం/పాతపట్నం : కళింగ కోమటి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో వనమహోత్సవం కళింగవైశ్య కుటుంబ సమ్మేళనం ఆదివారం వేణు మాష్టారు తోట (పాతపట్నం తిడ్డిమి రోడ్) వద్ద వైభవంగా నిర్వ హించబడింది. ఈ మహోత్సవానికి ముఖ్య అతిథిగా అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీ సభ్యులు, పాతపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మామిడి గోవిందరావు విచ్చేసి ప్రత్యేకంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోవిందరావు మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి, యువతలో సేవా స్ఫూర్తి పెంపుకు, పెద్దల ఉపదే శాలకు నిలయంగా ఇలాంటి కుటుంబ సమ్మేళనాలు ఎంతో ముఖ్యం. కళింగవైశ్య సమాజం ఏకతా - సేవాభావానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు ఉందని పేర్కొన్నారు. సమాజ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కళింగవైశ్య కుటుంబాలు పాల్గొని భక్తి, భోజన, సాంస్కృతిక కార్యక్రమాలతో వేడుకను విజయవంతం చేశారు.నిర్వాహకులు ఎమ్మెల్యే కి కృతజ్ఞతలు తెలిపారు.

మెట్ట రాధాకాంతమ్మ సంతాప సభ

విశాలాంధ్ర - టెక్కలి : జనసేన టెక్కలి నియోజకవర్గ ఇన్చార్జ్ కణితి కిరణ్ కుమార్ అమ్మమ్మ మెట్ట రాధాకాంతమ్మ ఇటీవల మృతి చెందారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆదివారం ఆదిత్య కన్వెన్షన్ మండ పంలో ఆమె సంతాప సభ కార్యక్రమాన్ని నిర్వ హించారు. ముందుగా వారి కుటుంబ సభ్యులు మరియు జనసేన జిల్లా నాయకులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కుటుంబ బాధ్యతలను చక్కదిద్దుకుంటూ అందర్నీ కలుపుకుంటూ కుటుంబం కోసం ఎన్నో సేవలు అందించిన ఆమె మరణం కుటుంబ సభ్యుల్లో తీవ్ర లోటు అని అన్నారు. ఈ కార్యక్రమానికి జనసేన జిల్లా అధ్యక్షులు పి.చంద్రమోహన్ తోపాటు ఆముదాలవలస, పలాస నాయకులు ఆమెకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కిరణ్ కుమార్ కుటుంబ సభ్యులు మరియు ఆముదాలవలస నియోజకవర్గ ఇన్చార్జ్ పేడాడ రామ్మోహన్, పలాస జనసేన నాయకులు, మాజీ కేంద్రమంత్రి కిల్లి కృపారాణి, రామ్మోహన్ నాయుడు, నియోజకవర్గ నాయకులు సంతబొమ్మాళి మండల అధ్యక్షులు తాడేల్లి చిరంజీవి, త్రివేణి, కుమారస్వామి, గవరయ్య, జనార్ధన రెడ్డి, మెట్ట నరేష్ మరియు జనసేన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

సేవ భావం కలిగి ఉండాలి : ఏ.పి.టి.పి.సి చైర్మన్ వజ్జ బాబురావు

విశాలాంధ్ర - పలాస : ప్రతి ఒక్కరిలో సేవ భావం కలిగి ఉండాలని ఏ.పి.టి.పి.సి చైర్మన్ వజ్జ బాబురావు అన్నారు. ఆదివారం పలాస కాశీబుగ్గ మున్సి పాలిటీ 31వ వార్డు ఇంచార్జి కొరికాన శంకరరావు వార్డ్ లో ఉన్న పేదలకు తన సొంత ఖర్చుతో దుప్పట్లు మరియు పండ్లు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంనకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబురావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలాస నియోజకవర్గ ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాల మేరకు పేదలకు ఈ చలికాలంలో దుప్పట్లు పంచే బృహత్కర కార్యక్రమం చేపట్టడం, ఆయనకు ప్రజలపై ఉన్న సేవాభావం, ఉదారతను తెలియజేస్తుందని అన్నారు. పేదలకు సుమారు 300 మందికి పైగా దుప్పట్లు పంచిపెట్టిన ఈ కార్యక్రమంలో తనను భాగస్వామ్యం చేసినందుకు ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు ఆ వార్డు పరిధిలో ఉన్న జనసేన నాయకులు ప్రశాంత్, కిషోర్, అక్కడ యువత పేద ప్రజలు పాల్గొన్నారు.

మందస మండల యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం

విశాలాంధ్ర - మందస : యుటిఎఫ్ అంటే పోరాటాల సంఘమని ఉపాధ్యాయుడే కాదు, ఇతర సంఘాల కార్యకర్తలు కూడా భావిస్తున్నారంటే పోరాట మార్గంలో యు.టి.ఎఫ్ సాధించిన విజయాలే అని చెప్పటంలో అతిశయోక్తి లేదని నూతన కౌన్సిల్ ఎన్నికల అధికారిగా వ్యవహరించిన జిల్లా కార్యదర్శి గున్న రమేష్ అన్నారు.ఆదివారం మండలం నూతన కార్యవర్గ కౌన్సిల్ సమావేశం మందస ఉన్నత పాఠశాలలో జరిగింది. నూతన కార్యవర్గంలో గౌరవ అధ్యక్షులుగా జన్ని సోమేశ్వరరావు, అధ్యక్షులుగా జగదీష్ బడిత్య, సహ అధ్యక్షులుగా ధర్మాపు కిరణ్, ప్రియాంక మహారాణా, ప్రధాన కార్యదర్శిగా దాసరి ఈశ్వరరావు, కోశాధికారిగా సోమనాథ్ శిష్టు, సిపిఎస్ కన్వీనర్ గా సారి ప్రేమ్ కుమార్ లు ఏకగ్రీవంగా ఎన్నుకోబడ్డారు. సీనియర్ ఉపాధ్యాయులు గున్న గంగాధరరావు మాట్లాడుతూ మండలంలో యూపీ పాఠశాలల సాధన కోసం అలుపెరగని పోరాటం చేసి హెరాన్నాలి, కొరడాబడి పాఠశాలలను పునరుద్ధరించడంలో యూటీఎఫ్ కృషి అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా పూర్వపు కార్యదర్శి రాజాన పరమేశ్వరరావు, మండల పూర్వపు గౌరవ అధ్యక్షులు జయరాం మాలి, కొర్ల తేజేశ్వరరావు, మండల పూర్వపు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిన్నింటి కొండలరావు, కొర్ల సోమేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లు మజ్జి శివకేశ్వర రావు, ఎస్ ఆనందరావు, గున్న చంద్రశేఖర్, తరణి సోమేశ్వరరావు, గంట గోపాలకృష్ణ, పాలిన సాయికుమార్, బాలరాజున పాత్రో, పితాంబరం మాలి, బనిశెట్టి శ్రీనివాసరావు, ఎస్.రజిని, ప్రవీణ్ ప్రధానో, సత్యానంద బెహరా, తదితరులు పాల్గొన్నారు.

తమ్మినేనిని మర్యాద పూర్వకంగా కలిసిన జల్లు

విశాలాంధ్ర - ఆమదాలవలస : వైసీపీ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి బూర్జ మండలం మాజీ డిసిసిబి డైరెక్టర్ జల్లు బలరాం నాయుడు కి జిల్లా టీచర్స్ ఫెడరేషన్ అధ్యక్షులుగా నియమించిన సందర్భంగా మాజీ స్పీకర్ పార్లమెంటరీ సమన్వ యకర్త తమ్మినేని సీతారాం ని ఆదివారం తన నివాసం వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడిగా నూతన బాధ్యతలు స్వీకరించిన జల్లు బలరాం నాయుడుకి తమ్మినేని శుభాకాంక్షలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గుమ్మడి రాంబాబు జడ్పిటిసి బెజ్జిపరపు రామారావు ఎంపీపీ కర? నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నకిలీ బిల్లులతో నిధుల మాయాజాలం..!!

- డ్వామా పూర్వపు అధికారి నిర్వాకం - మరో ఇద్దరు ఉద్యోగుల ప్రత్యక్ష సహకారం
- ఎకౌంట్లలో వడ్డీలు, ప్రిన్సిపల్ అమౌంట్‌లలో కూడా గోకేసారట

విశాలాంధ్ర - శ్రీకాకుళం : చెప్పేవి శ్రీరంగనీతులు... చేసేవి అడ్డగోలు అవినీతి పనులు అన్న చందంగా పూర్వపు జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి తీరు ఉందని ఆ శాఖ సిబ్బంది ఆరోపిస్తున్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సమయంలో సిబ్బందిని తీవ్ర మనోవేదనకు గురిచేసిన ఆయన జిల్లా వదిలి వెళ్ళిపోవడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేయడమే కాక దేవాలయాలకు వెళ్లి మరి తమ మొక్కులు తీర్చుకుంటున్నారంటే వేధింపులు ఏ స్థాయిలో ఉండేవో అర్థం చేసుకోవచ్చు. తాను నిజాయితీపరుడునని శుద్ధపూస కబుర్లు చెప్పే ఈయన గతంలో విధులు నిర్వహించిన సమయంలో విజిలెన్స్ విచారణలు కూడా ఎదుర్కొన్నారని తెలుస్తోంది. ఇక్కడ కూడా తన అవినీతి వ్యవహారాలు బయటపడకుండా ఉండేందుకు, తనపై ఎవరి దృష్టి పడకుండా చేసేందుకు గాను సిబ్బందిపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడి వారి దృష్టిని మరల్చే ప్రయత్నం తీవ్ర స్థాయిలో చేశారని, ఆ భయం ముసుగులోనే సిబ్బందిని ఉంచడం ద్వారా ప్రభుత్వ నిధులను దోపిడీకి పాల్పడ్డారు అన్న విమర్శలు ఈయనపై పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. పండగలు, సెలవు దినాలు, భోజన విరామ సమయాల్లో గూగుల్ మీట్లు పెట్టడం, గంటల తరబడి కొనసాగించడం, విధులు కేటాయించడం వంటివి చేయడం ద్వారా సిబ్బందిని అగచాట్లకు గురిచేసిన సందర్భాలు కోకొల్లలు అన్నది క్షేత్రస్థాయి ఉద్యోగుల మాటగా ఉంది.

ఇంటి నిర్వహణ, నలవారి ఖర్చు నకిలీ బిల్లులే..

ఈ అధికారి వారు ఉండే ఇంటిని క్యాంప్ ఆఫీసుగా సంభోదించి సదరు ఇంటి అద్దె, కరెంటు బిల్లు, నెలవారి ఇంటి నిర్వహణ ఖర్చులు అన్ని కార్యాలయంలోని అడ్మినిస్ట్రేటివ్ ఫండ్ లేదా ఇతర నిధుల నుండి నకిలీ బిల్లులు పెట్టడం ద్వారా వచ్చిన నిధులను దారి మళ్ళించే వారని బహిరంగంగానే ఆరోపణలు ఉన్నాయి. ఇవి కాక అయ్యవారికి ఉదయం, సాయంత్రం మిక్స్ డ్రై ఫ్రూట్స్ ప్రతిరోజు తినేందుకుగాను విశాఖపట్నం నుండి స్పెషల్ గ్రేడ్ డ్రైఫ్రూట్స్ తెప్పించేవారంటే ఏ మేరకు ఇక్కడ రాజసం వెలగపెట్టేవారో ఊహించుకోవచ్చనీ పలువురు ఉద్యోగులు చర్చించు కుంటున్నారు. మినరల్ వాటర్ బాటిల్స్, సొంత కారుకు పెట్రోలు, పసందైన విందు భోజనం, ఇతర విలాసవంతమైన ఖర్చులు అన్నీ ప్రభుత్వ ఖాతాలో నుంచి వెళ్లేవట. సదరు ఇంట్లో పెట్టిన ఫర్నిచర్ నుండి హ్యాండ్ వాష్ సింక్ వంటి వస్తువులు కూడా కార్యాలయ నిధుల నుండి దారి మళ్లించినవేనని పుకార్లు షికార్లు చేస్తున్నాయి.

శిక్షణ తరగతుల నిధులు స్వాహా?..

మండల స్థాయిలో మేట్లు, ప్రజా ప్రతినిధులు, ఫీల్డ్ అసిస్టెంట్లు శిక్షణ తరగతుల పేరుతో తూతూ మంత్రపు సమావేశాలు నిర్వహించి వాటిని శిక్షణా తరగతులుగా చూపించి ట్రెనింగ్ మెటీరియల్, ఉదయం, సాయంకాలం స్నాక్స్, వాటర్ బాటిల్స్, మధ్యాహ్నం విందు, తదితర ఖర్చులను రికార్డుల్లో రాసుకొని నిధులు దిగమింగేరన్న ఆరోపణలు ఈయన హయాంలో ఎన్నో ఉన్నాయి. అదేవిధంగా జిల్లాస్థాయిలో ఏపీవోలు, ఈసీలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఇతర సిబ్బంది సమీక్ష సమావేశాలు లేదా శిక్షణ తరగతుల నిర్వహణ పేరుతో జిల్లా కార్యాలయంలో సమావేశాలు నిర్వహించేవారు. జిల్లా నలుమూలల నుండి జిల్లా కేంద్రాలకు వచ్చే మండల స్థాయి సిబ్బంది సమావేశాలు ఉదయం నుండి సాయంత్రం వరకు జరగాల్సి ఉండగా కేవలం ఒక పూటతో సమావేశాలను ముగించి ఆకలితో సిబ్బందిని పంపించిన సందర్భాలే ఎక్కువని బహిరంగ విమర్శలు ఉన్నాయి. అయితే రికార్డుల్లో మాత్రం శిక్షణా తరగతుల సామాగ్రి, స్నాక్స్, భోజనం, ఇతర నిర్వహణ ఖర్చులు రికార్డుల్లో నమోదు చేసి నిధులు బొక్కేసేవారన్న ఆరోపణలు కూడా లేకపోలేదు.

ఆ ఇద్దరే సూత్రదారులు..

నిధులునియోగం దారి మళ్లింపు బినామీ బిల్లులతో నిధులు డ్రా చేయడం వంటి మొత్తం వ్యవహారాల్లో ఈ కార్యాలయాన్ని చెందిన ఇద్దరు ఉద్యోగులు సూత్రధారులు మరియు పాత్రధారులుగా వ్యవహరించి పూర్వపు అధికారి మన్ననలు పొందుతూ ఆయనకు అనుచరులుగా ఒక విధంగా చెప్పాలంటే వ్యక్తిగత సహాయకులుగా కూడా వ్యవహరించే వారన్నది బహిరంగ రహస్యం గా చెప్పుకుంటున్నారు. ఈ విషయాన్ని జిల్లా మొత్తం మీద ఏ ఉపాధి ఉద్యోగిని అడిగిన ఇట్టే సమాధానం చెప్తారనీ కొందరంటున్నారు. విధి నిర్వహణకు సంబంధించిన సబ్జెక్టులో కనీస పరిజ్ఞానం లేని నాగేంద్రుడు, అప్పటి అధికారికి అత్యంత సన్నిహితంగా వ్యవహరిస్తూ ఉదయం టిఫిన్ నుండి భోజనం, రాత్రి పడుకునే వరకు అన్ని వ్యవహారాలను దగ్గరుండి సమకూర్చే మరొక సన్నిహిత ఉద్యోగి, ఇద్దరు ఏకమై అధికారి అక్రమాలకు వంత పాడుతూ మొత్తం వ్యవహారాన్ని నడిపించి సూత్రధారులు, పాత్రధారులుగా మారారని బోగట్టా. లేని షాపుల్లో కొనని వస్తువు కొన్నట్లు నకిలీ బిల్లులు సృష్టించి ఆ బిల్లుపై సంతకాలు సైతం వీరే పెట్టి, సిబ్బంది అందరూ ఇంటికి వెళ్లిన తర్వాత రాత్రి సమయంలో ఈ నకిలీ బిల్లుల ఫైల్లు పై సంతకాలు ప్రక్రియ పూర్తి చేసే వారిని వినికిడి. అప్పటి అధికారితో పాటు ఈ ఇద్దరు ఉద్యోగులు కూడా పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడ్డారని, మొత్తం వ్యవహారంలో వీరు కూడా భాగస్వాములేనని సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ సహా ఉన్నతాధికారులు స్పందించి డ్వామా కార్యాలయ అకౌంట్ల లావాదేవీలు, ఈ నిధులకు సంబంధించిన వడ్డీలు ఏమయ్యాయి అన్న విషయంతో పాటు పెట్టిన బిల్లులను పరిశీలించినట్లయితే నిధుల దుర్వినియోగం వ్యవహారం తేటతెల్లమవుతుందని అంటున్నారు.

పల్లె పల్లెల్లో జెండర్ అవగాహన ర్యాలీలు

విశాలాంధ్ర - మందస : జాతీయ స్థాయిలో నేషనల్ రూరల్ లైవ్ లీవుడ్ మిషన్ మరియు రాష్ట్ర స్థాయిలో సేర్ఫ్ వారి సూచనల మేరకు నయీ చేతన్ 4.0 జండర్ ఆధారిత వివక్షకు వ్యతి రేకంగా ప్రతి పల్లె పల్లెలో మహిళలతో అవగాహన ర్యాలీలు నిర్వహి స్తున్నట్లు వెలుగు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. వికసిత గ్రామీణ భారత్ దిశగా సమ్మిళిత వృద్ధికి, ఆర్థిక సాధికారతకు మహిళలే ముందడుగు వేస్తూ, గ్రామాలలో మహిళా సంఘాలకు జెండర్ ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా క్రియాశీల అవగాహన కల్పించాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం మందస మండల పరిధిలోగల హరిపురం, బిన్నల మదనాపురం, సువర్ణాపురం, ఉమాగిరి తదితర గ్రామాలలో జండర్ ర్యాలీ చేపట్టి అవగాహన కల్పించారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మినిస్ట్రీ ఆఫ్ రూరల్ డెవలప్మెంట్ రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్తంగా నిర్వహిస్తున్న హ్యూమన్ డెవలప్మెంట్ యాక్టివిటీస్‌లో భాగంగా మహిళా సంఘాల సభ్యులు పూర్తి అవగాహనతో హింసకు తావులేని కుటుంబాలు మరియు జండర్ ఈక్విటీ సమాజం దిశగా పయనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు, క్లస్టర్ కోఆర్డినేటర్లు మీనాక్షి, ముఖలింగం, వి.వో.ఏ.లు, రాములమ్మ, చంద్రిక, కరుణ శ్రీ, అనూ, కేశమ్మ, గ్రామ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నా విద్యా అర్హతలపై మాట్లాడే హక్కు ‘కూన’కు లేదు

విశాలాంధ్ర - ఆమదాలవలస : ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ నా విద్యార్హతలు పై మాట్లాడే హక్కు ఆయనకు లేదని అతనికి ఏమైనా సర్టిఫికెట్లు ఇచ్చే బినామీ కంపెనీ నడుపుతున్నారా అని వైసిపి సమన్వయ కర్త చింతాడ రవికుమార్ అన్నారు. తనకు కార్యకర్త రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతూ మా పార్టీని కించపరిస్తున్నారని అలాగే ఫేక్ సర్టిఫికెట్లు చేసే ఫ్యాక్టరీ తనకు ఉందా అని ప్రశ్నిస్తూ చింతాడ రవికుమార్ ఆదివారం ఆమదాలవలస పోలీస్ స్టేషన్లో తన అన్యాయులతో కలిసి ఫిర్యాదు చేశారు. కూన రవి కుమార్ పై కేసు నమోదు చేసి విచారణ జరపాలని చింతాడ కోరారు. మా కేడర్ ని చెప్పుతో సమానంగా చూస్తూ, తిండి తినేవారు కాదని బట్ట కట్టేవారు కాదని ఒక ఎమ్మెల్యేగా వైసిపి నాయకులను అవహేళన చేశారని ఆయన ఆవేదన చెందారు. సభ్య సమాజం సిగ్గుపడేలా ఆయన మాట్లాడిన తీరు వైసీపీకి డ్యామేజ్ చేసే విధంగా ఉందని ఆయన స్పష్టం చేశారు. తక్షణమే ఆయనపై కేసు నమోదు చేసి విచారణ జరపాలని పోలీసులను కోరారు.

369 మందిని పరీక్షించిన జెమ్స్ ఆసుపత్రి వైద్యులు

విశాలాంధ్ర - నరసన్నపేట : స్థానిక పసారువీధిలోని విజ్ఞాన్ విద్యా నికేతన్ స్కూల్‌లో ఆదివారం జెమ్స్ ఆసుపత్రికి చెందిన వైద్యులు ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నరసన్నపేట పట్టణానికి చెందిన సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరంలో 13మంది వైద్యులు సుమారు 369మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వ్యాధులు గుర్తించిన 53మంది రోగులకు రాగోలు లోని జెమ్స్ ఆసుపత్రికి తరలించారు. ఈ కార్యక్రమంలో జెమ్స్ ఆసుపత్రి వైద్యులు, డా.సిహెచ్.శ్వేత, డా.లక్ష్మీ మాధురీ, డా.ఎం.దీప్తిరాణి, సిబ్బంది, ఆర్.శంకరరావు, పిఆర్వో, బి.దాలయ్య, ఏ.ఎం, సిహెచ్. నారాయణరావు, సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ గౌరవ అధ్యక్షుడు, పుచ్చల విశ్వేశ్వరరావు, అధ్యక్షులు, సువ్వారి మురళీధర్‌రావు, కోశాధికారి, ఉప్పాడ పూర్ణారావు, ప్రతినిధులు, రోణంకి కృష్ణంనాయుడు, మార్పు విజయ్‌కుమార్, ఇప్పిలి జగన్నాథం, మాడుగుల మాధవరావు, ఎం.నరసింహమూర్తి, యాళ్ళ జగ్గారావు, చింతాడ ధర్మారావు, కె.రమేష్, ఎస్.ఆనంద్‌రావు, శ్రీకృష్ణదేవరాయలు, గొండు సత్యన్నారాయణ, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగేశ్వర స్వామిని దర్శించుకున్న హైకోర్టు జడ్జి రవినాథ్



విశాలాంధ్ర - జలుమూరు/నరసన్నపేట : నియోజకవర్గంలోని జలుమూరు మండలం, శ్రీముఖలింగం దేవాలయంలో శ్రీముఖలింగేశ్వర స్వామివారిని ఆదివారం హైకోర్టు జడ్జి, రవినాథ్ తిలహరి దంపతులు దర్శించుకున్నారు. అనంతరం శ్రీ మధుకేశ్వర స్వామివారిని దర్శించుకొని, స్వామివారి తీర్థ,ప్రసాదాలు, ఆలయ అర్చకుల బృందం ఆశీర్వాదాలను అందచేసి, స్వామివారి చిత్రపటాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయంలోని అద్భుత శిల్ప కళలను పరిశీలించారు.

తిరుమల వెంకన్నను దర్శించుకున్న ఎమ్మెల్యే బగ్గు దంపతులు

విశాలాంధ్ర - నరసన్నపేట : తిరుమల తిరుపతి దేవస్థానంలో కలియుగ దైవం, శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి, ఆయన సతీమణి బగ్గు సుగుణమ్మ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే, బగ్గు రమణమూర్తి, 67వ జన్మదినం సంధర్భంగా తిరుమల దేవస్థానానికి కుటుంబ సమేతంగా వెళ్ళిన ఎమ్మెల్యే, రమణమూర్తి, దేవాలయంలోని వేద పండితుల ఆశీర్వచనాలు, తీర్థ,ప్రసాదాలను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ నా జన్మదినం సంధర్భంగా శుభాకాంక్షలు తెలిపిన ప్రతీ ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలియచేస్తున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే, కుమారుడు, బగ్గు సునీల్ దంపతులు, పారశిల్లి పంచాయితీ సర్పంచ్ ప్రతినిధి, డబ్బీరు కిషోర్ చంద్ పట్నాయిక్ దంపతులు పాల్గొన్నారు.